
సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 31 । జూలై । 2024



కాటేసే కాలం.. జర భద్రం

అపరిశుభ్రంగా ఉండే ప్రదేశాలు, చెట్ల పొదలు విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. 10లో▸



ఉద్యమాన్ని ఆపలేరు

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి అన్నారు. 10లో▸



గంజాయి పట్టివేత

గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

నందిగామ: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. ఈదులపల్లి శివారులోని ఓ గార్డెన్‌లో జరుగుతున్న పార్టీ జిల్లా శిక్షణ తరగతులకు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ రాష్ట్ర స్థాపనే బీజేపీ అసలు లక్ష్యమని, ప్రస్తుతం దేశంలో మతోన్మాదం, మూఢనమ్మకాలు పెచ్చరిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.రాజు, నాయకులు చంద్రమోహన్, జగదీశ్, యాదయ్య, సామెల్, శోభన్, కవిత, నర్సిరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూములను రక్షించండి



అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాట సింగారం, కొత్తగూడెం, పిగ్లీపూర్ గ్రామాల్లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ, సీలింగ్, భూదాన్ భూములతో పాటు లే అవుట్లలో ప్రజావసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాలు, ఖాళీ స్థలాలను ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, పలువురు నాయకులు, గ్రామస్తులు మంగళవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మూడు గ్రామాల పరిధిలోని ఆయా భూములను కాజేయడానికి కొత్తగూడెం గ్రామానికి చెందిన నార్లకొండ వెంకటేశ్ మరి కొంతమందితో ముఠాగా ఏర్పడి ఆక్రమించుకుంటున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఆ ముఠా సభ్యులు రూ.50 కోట్ల విలువ చేసే ప్రభుత్వ, ప్రజా భూములు ఆక్రమించారని ఆరోపించారు. ప్రభుత్వ, సీలింగ్, భూదాన్ భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విలువైన భూములను కాపాడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు బోసుపల్లి ప్రతాప్, పాపయ్యగౌడ్, గడ్డం కుమార్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్లాట్ల స్థలాలు చూపించండి

కలెక్టర్ శశాంకకు ఫార్మాసిటీ భూ బాధితుల వినతి

యాచారం: ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు గత బీఆర్ఎస్ సర్కార్ 121 గజాల చొప్పున ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇచ్చిందని, ఏడాది గడుస్తున్నా స్థలాలు చూపించలేదని ఫార్మాసిటీ భూ బాధితులు కలెక్టర్ శశాంక దృష్టికి తెచ్చారు. ఈ మేరకు మంగళవారం యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద, కందుకూరు మండల పరిధిలోని సార్లరావులపల్లి తదితర గ్రామాల నుంచి 50 మందికి పైగా రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే సర్టిఫికెట్ల ప్రకారం ప్లాట్లకు నంబర్లు వేసి స్థలాలు చూపించాలని కోరారు. ఫార్మాసిటీకి భూములిచ్చిన యాచారం, కందుకూరు మండలాల పరిధిలోని పలు గ్రామాల భూ బాధితులకు మీరాఖాన్‌పేట పరిధిలోని 600 ఎకరాల్లో హెచ్ఎండీఏ వెంచర్ చేసినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ సర్కార్ ఎన్నికలకు ముందు ఎకరా భూమి కోల్పోయిన రైతుకు 121 గజాల చొప్పున ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. నేటికీ స్థలాలు చూపించలేదన్నారు. ఫార్మాసిటీకి భూములిచ్చిన గ్రామాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలు జీవనోపాధి కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రైతులు, వ్యవసాయ కూలీలకు పునరావాస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ స్థలాలు చూపించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు నీలం శ్రీకాంత్, భీమ్‌నాయక్, గోపలి శంకరయ్య, అశోక్, శ్రీను, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

• సీత్లా సంబరం

ఆమనగల్లు మండలం శంకరకొండ తండాలో మంగళవారం గిరిజనులు సీత్లా పండుగను ఘనంగా జరుపుకొన్నారు. గిరిజన మహిళలు ఇంటి నుంచి నైవేద్యంతో ఊరేగింపుగా వచ్చి తండా సమీపంలోని సీత్లా భవానీ ఆలయంలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని వేడుకున్నారు. గిరిజనుల నృత్యాలు అలరించాయి. – ఆమనగల్లు



• బోనాల అంబరం



మొయినాబాద్ మండలం ముర్తుజాగూడ గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గ్రామంలోని మహిళలు మట్టికుండల్లో నైవేద్యంతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా డప్పుల దరువులు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. – మొయినాబాద్‌రూరల్

జీఐఎస్ మ్యాపింగ్ కోసం..

క్షేత్రస్థాయి సర్వే ప్రారంభం

- మెరుగైన పట్టణ ప్రణాళికే లక్ష్యం
- పన్నుల వసూలు సులభతరం



ఉప్పల్‌లో జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సర్వేను ప్రారంభిస్తున్న డీసీ ఆంజనేయులు, ఇతర అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో ఆస్తులు, యుటిలిటీస్ జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయి ప్రక్రియ ప్రారంభమైంది. మ్యాపింగ్‌కు సంబంధించి ఇప్పటికే శాటిలైట్ సర్వే పూర్తి కాగా.. డ్రోన్ సర్వే జరుగుతోంది. దీంతోపాటు తాజాగా క్షేత్రస్థాయి సర్వే ప్రారంభమైంది. మంగళవారం ఉప్పల్, హయత్ నగర్, హైదర్ నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో సర్వే ప్రారంభమైందని, మిగతా ప్రాంతాల్లోనూ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు. మెరుగైన పట్టణ ప్రణాళిక కోసం చేపట్టిన ఈ సర్వేతో అన్ని ఆస్తులు, యుటిలిటీస్ వివరాలు కచ్చితంగా మ్యాపింగ్ చేయడం ద్వారా వాటిని భౌగోళికంగా సులభంగా గుర్తించొచ్చు. మరోవైపు జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను, ట్రేడ్‌లైసెన్స్ తదితర పన్నుల వసూలు కూడా సులభతరం కానుంది. వీటితో పాటు ఆస్తిపన్నుకు సంబంధించి ప్రజలకెదురవుతున్న సమస్యల పరిష్కారానికీ మ్యాపింగ్ ఉపకరిస్తుందని, ఆన్‌లైన్ చెల్లింపులు మరింత సులభతరమవుతాయని జీహెచ్ఎంసీ పేర్కొంది. హై రిజల్యూషన్ మ్యాపింగ్‌తో రోడ్లు, పార్కులతో పాటు ఇతరత్రా సదుపాయాల వివరాలు స్పష్టంగా తెలుస్తాయని పేర్కొంది.

ప్రజలు సహకరించాలి..

వనరుల నిర్వహణ కోసం చేపట్టిన ఈ సర్వేకు ఇంటి యజమానులు సహకరించాలని, సర్వే సిబ్బంది కోరిన సమాచారాన్ని తెలియజేయాలని జీహెచ్ఎంసీ కోరింది. సర్వే వివరాలు అత్యంత గోప్యంగా ఉంటాయని స్పష్టం చేసింది. క్షేత్రస్థాయిలో సర్వే కోసం వచ్చే సిబ్బందికి భవన నిర్మాణ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, లేటెస్ట్‌గా చెల్లించిన ఆస్తి పన్ను రసీదు, నల్లా బిల్లు, విద్యుత్ బిల్లు, యజమాని ఐడీ వివరాలు, ట్రేడ్ లైసెన్స్ నంబర్ (కమర్షియల్ భవనాల) వివరాలు అందించి సహకరించాలని జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేసింది.

ప్రతి ఇంటికీ యూనిక్ ఐడీ

సర్వేలో భాగంగా ప్రతి భవనానికి యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయిస్తారు. దీంతో భవిష్యత్‌లో ఏవైనా విపత్తులు, ప్రమాదాలు వంటివి జరిగినప్పుడు సంబంధిత యంత్రాంగం వేగంగా అక్కడికి చేరుకునేందుకు ఉపకరిస్తుంది. ఈ యూనిక్ నంబర్‌ను వాటర్‌బోర్డు, విద్యుత్ సంస్థలకు అనుసంధానం చేయనున్నారు. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతాయని భావిస్తున్నారు.

జీహెచ్ఎంసీకి పెరగనున్న ఆదాయం

సర్వేతో ప్రతి భవనం విస్తీర్ణం, వినియోగం తదితరమైనవి కచ్చితంగా మ్యాపింగ్ చేస్తారు. ప్రస్తుతం చాలా భవనాల వాస్తవ విస్తీర్ణాలు, ఆస్తిపన్ను చెల్లిస్తున్న విస్తీర్ణాల్లో తేడాలున్నాయి. సర్వేతో సరైన వివరాలు తెలుస్తాయి. తద్వారా జీహెచ్ఎంసీకి, ఆస్తిపన్ను, వాటర్‌బోర్డుకు నల్లా బిల్లుల ద్వారా వచ్చే ఆదాయం కూడా పెరుగుతుందని భావిస్తున్నారు.

యుటిలిటీస్ సమాచారం సైతం

జీహెచ్ఎంసీ పరిధిలోని పార్కులు, నాలాలు, నీటి సరఫరా లైన్లు, మురుగునీటి లైన్లు, ఆట స్థలాలు, రోడ్లు, వీధి దీపాలు, హాస్పిటళ్లు, ఫైర్ సర్వీస్ స్టేషన్లు, విద్యా సంస్థలు, పెట్రోలు బంకులు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, చెరువులు, ఖాళీ స్థలాలు, రైల్వే లైన్లు తదితర భౌగోళిక వివరాలన్నీ మ్యాపింగ్ చేయడం ద్వారా వివిధ ప్రభుత్వ విభాగాలు తమ శాఖలకు సంబంధించిన పనులు చేయడం సులభమవుతుంది. అంతేకాదు జీహెచ్ఎంసీలోని వార్డులు, సర్కిళ్లు, స్లమ్స్ వివరాలు వంటివి కూడా సరిహద్దులతో సహా రికార్డు కానున్నాయి. తద్వారా ఆయా ప్రభుత్వ పథకాల అమలుకు, ప్రజల భాగస్వామ్యానికి మార్గం సుగమం కానుంది.

రుణమాఫీ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక సూచించారు. రుణమాఫీ రెండో విడత నిధుల విడుదలలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడత సుమారు 49,700 రైతులకు గాను రూ.258.18 కోట్లు కేటాయించగా, రెండో విడతగా సుమారు 22,915 మంది రైతులకు గాను రూ.218.12 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 72,615 మంది రైతులకుగాను రూ.476.30 కోట్లు రుణమాఫీ పథకం ద్వారా ప్రభుత్వం జిల్లాకు వెచ్చించిందని వివరించారు. సాంకేతికపరంగా ఏదైనా రైతుకు మాఫీ అందకపోతే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రుణమాఫీ అర్హులుగా ఉన్న రైతులకు తిరిగి పంట రుణాలు ఇచ్చేలా సహకరించాలని బ్యాంకు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, రైతు సంఘాల అధ్యక్షులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

కలెక్టరేట్ ఎదుట బీజేపీ నేతల నిరసన

ఇబ్రహీంపట్నం రూరల్: కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి డిమాండ్ చేశారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆచారి మాట్లాడుతూ.. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీల ఓట్లతోటి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరిచిందని అన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. నేటికీ బీసీ కుల గణన చేయకుండా మభ్యపెడుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా బీసీ గణన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సెన్సార్‌బోర్డు మాజీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్‌గౌడ్, సురేందర్ యాదవ్, కొత్త అశోక్‌గౌడ్, సిద్ధప్ప, లక్ష్మీపతిగౌడ్, రవీందర్, సందీప్‌కుమార్, పొట్టి రాములు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ తదితరులు

మహేశ్వరాన్ని తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

కందుకూరు: మహేశ్వరాన్ని మహానగరంలా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ అన్నారు. నెట్ జీరో సిటీలో చేపట్టనున్న నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయడానికి ఆగస్టు 1న ముఖ్యమంత్రి రానున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణ శంకుస్థాపన, అక్కడ నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. రైతులకు ప్లాట్లు ఇచ్చే లేఅవుట్‌లో అన్ని వసతులతో ప్రణాళిక ప్రకారం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ తదితర కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఇక్కడే నిర్మించనున్నట్టు తెలిపారు. ఇక్కడ చదివిన విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలో శిక్షణ ఇప్పించి ఈ ప్రాంతంలో నెలకొల్పే కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సీఎం కార్యక్రమాన్ని జయప్రదం చేసేలా శ్రేణులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, కోఆర్డినేటర్ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, ఎ.సత్యనారాయణ, ఎస్.జగన్, ఎస్.వీరారెడ్డి, బి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

ఎంజేపీటీ బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సైదులు

చేవెళ్ల: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మహాత్మాజ్యోతిబా గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి, ఐఎఫ్ఎస్ అధికారి సైదులు అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న మియాపూర్‌కు చెందిన ఎంజేపీటీ బీసీ గురుకుల పాఠశాలలో మంగళవారం మైండ్ స్పార్క్ పథకంలో భాగంగా 20 కొత్త కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను జిల్లా రీజినల్ కోఆర్డినేటింగ్ అధికారి యాదయ్యగౌడ్, కాగ్నిజెంట్ మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఉపయోగపడే కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో వీటి ఏర్పాటుకు కాగ్నిజెంట్ మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ ల్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాగ్నిజెంట్ ప్రతినిధులు మేఘ, ఆనంద్, అచ్యుత్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహ, ఉపాధ్యాయులు మణిమాల, రమ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జపాన్ సైన్స్ ఫెస్టివల్‌కు చేవెళ్ల విద్యార్థి ఎంపిక



సరబ్‌జిత్

చేవెళ్ల: జపాన్‌లో జరగబోయే సైన్స్ ఫెస్టివల్‌కు తెలంగాణ నుంచి చేవెళ్ల ఆదర్శ కళాశాల విద్యార్థి సరబ్‌జిత్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టీనావతి వెల్లడించారు. సరబ్‌జిత్ ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మంగళవారం నిర్వహించిన రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో విజయం సాధించాడని చెప్పారు. నవంబర్‌లో జపాన్‌లో జరిగే సైన్స్ ఫెస్టివల్‌కు రాష్ట్రం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికకాగా తమ కళాశాల విద్యార్థి సరబ్‌జిత్ మొదటిస్థానంలో నిలిచి ఎంపికైనట్లు వివరించారు. ఈ మేరకు సరబ్‌జిత్‌ను అభినందించారు. జపాన్ ఫెస్టివల్‌లోనూ ప్రతిభ చాటి పేరు నిలబెట్టాలని ఆకాంక్షిస్తూ ఆల్‌దిబెస్ట్ చెప్పారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేయటానికి నిధులు కేటాయించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరారు. అసెంబ్లీ ప్రాంగణంలో మంగళవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి వివరించినట్లు తెలిపారు. వాటితోపాటు మిగతా పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



ముందస్తుగా అరెస్టయిన ఏఐటీయూసీ నాయకులు

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

చేవెళ్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల హక్కుల సాధనకు తలపెట్టిన చలో ఇందిరా పార్కు మహా ధర్నాకు వెళ్లకుండా పోలీసులు మంగళవారం ఏఐటీయూసీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ చర్యను వ్యతిరేకిస్తూ రామస్వామి మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగవన్నారు. మున్సిపల్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకై నగరంలోని ఇందిరా పార్కు దగ్గర తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అరెస్టులు చేయడం దారుణమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పదేళ్ల గత పాలనలో ఉద్యమాలను అక్రమ అరెస్టులతో ఏ విధంగా అడ్డుకున్నారో.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలానే చేస్తోందన్నారు. ఎవరికీ ఇబ్బంది వచ్చినా ఇందిరా పార్కు వద్ద ధర్నాలు చేసుకోవచ్చని స్వయంగా ముఖ్యమంత్రియే ప్రమాణ స్వీకారోత్సవం రోజు చెప్పిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యురాలు మంజుల, నాయకులు సత్తిరెడ్డి, మక్బుల్, కృష్ణగౌడ్, శివ, యాదగిరి, శివయ్య, ఆనందం, లలిత, రమాదేవి తదితరులున్నారు.

క్రికెట్ ఆడుతుండగా ఘర్షణ

బ్యాట్‌తో కొట్టిన యువకుడు

ఇబ్రహీంపట్నం రూరల్: క్రికెట్ ఆడుతుండగా తలెత్తిన ఘర్షణ కారణంగా బ్యాట్‌తో ఓ యువకుడిపై దాడి చేసిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం రాజీవ్ గృహకల్పకు చెందిన నేనావత్ చరణ్ తన స్నేహితులు కోటేష్, నాగరాజు, చింటూలతో కలిసి కాలనీ చివర్లో క్రికెట్ ఆడుతున్నారు. అదే కాలనీకి చెందిన సోఫియాన్ ఆడుకోవడానికి అక్కడికి వచ్చాడు. ఆ కారణంగా గొడవపడి సోఫియాన్ బ్యాట్‌తో చరణ్‌పై దాడి చేశాడు. ఈ విషయాన్ని సోఫియాన్ సోదరుడు సోహెల్‌కు చరణ్ తెలిపాడు. దీంతో సోదరున్ని సోహెల్ ఇంటి దగ్గర మందలించాడు. అదే సమయంలో సోఫియాన్, అతని సోదరులు సోహెల్, సామిల్ గొడవ పడ్డారు. ఆ క్రమంలో కాలనీకి చెందిన కరీం వారిని ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో సోఫియాన్ తండ్రి ఎవరి కోసమో మీరు గొడవపడడం ఎందుకని, దీనికి కారణమైన చరణ్‌ను చంపేస్తానని కత్తితో బెదిరించాడు. ఈ మేరకు పోలీసులు ఇరువురిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

పట్టాలు దాటుతూ వ్యక్తి మృతి

సికింద్రాబాద్: ప్లాట్‌ఫామ్ మారేందుకు పట్టాలు దాటే ప్రయత్నంలో రైలు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... నిజామాబాద్ అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన ఎస్.వెంకటరమణ (45) ప్రైవేటు ఉద్యోగి. సోమవారం రాత్రి నిజామాబాద్ వెళ్లేందుకు వెంకటరమణ సికింద్రాబాద్ చేరుకున్నాడు. 8వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తను వెళ్లాల్సిన రైలు కోసం వేచి చూస్తున్నాడు. నిజామాబాద్ రైలు 9వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌కు వస్తుందని అనౌన్స్‌మెంట్ రావడంతో పట్టాలు దాటుకుని అవతలి ప్లాట్‌ఫామ్ వెళ్లే ప్రయత్నం చేశాడు. ఇంతలో 8వ నెంబర్ ప్లాట్‌ఫామ్ మీదకు వచ్చిన తుంగభద్ర రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వెంకటరమణను రైల్వే పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. కొద్ది గంటల పాటు చికిత్స పొందిన ఆయన మంగళవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

'మధ్యాహ్న భోజనం అక్షయపాత్రకు ఇవ్వొద్దు'

కేశంపేట: గత 26 ఏళ్లుగా పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేల ఆరోపించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులతో కాకుండా హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయ పాత్ర ద్వారా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆమె మంగళవారం ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు పది వేల వేతనం అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులను శాశ్వతంగా తొలగించాలనే ప్రయత్నాలను చేస్తుందని ఆరోపించారు. మధ్యాహ్న భోజనాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దని ప్రభుత్వాన్ని కోరారు.


గుడి గంటల దొంగకు రిమాండ్

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో గుడి గంటల చోరీకి పాల్పడిన దొంగను యాచారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రానికి చెందిన బండారి దుర్గప్రసాద్ మంగళవారం గునుగల్ గేట్ వద్ద అనుమానంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో దుర్గప్రసాద్ రంగారెడ్డి జిల్లాలోని యాచారం పీఎస్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, నల్గొండ జిల్లా పరిధిలోని మర్రిగూడ పీఎస్ పరిధిలో ఉన్న పలు దేవాలయాల్లోని గుడి గంటలను చోరీకి పాల్పడినట్లు చెప్పారు. చోరీ చేసిన గంటలతో పాటు దుర్గప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు.

కాటేసే కాలం.. జర భద్రం

బుసలు కొడుతున్న విష సర్పాలు

- షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్కువైన పాముకాటు కేసులు
- ఆందోళనకు గురికావొద్దంటున్న వైద్యులు





యాంటీ వీనమ్ టీకా

షాద్‌నగర్: అపరిశుభ్రంగా ఉండే ప్రదేశాలు, చెట్ల పొదలు విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్చిన గుంతలు ఇళ్ల చుట్టూ ఉండటంతో పురుగులు, కప్పలు, ఎలుకలు ఎక్కువగా చేరుతున్నాయి. వీటిని తినడానికి ఆయా ప్రదేశాలకు పాములు సంచరిస్తున్నాయి. అదే విధంగా వ్యవసాయ పొలాలు, గట్ల వెంట ఎక్కువగా ఉండటంతో పాములు నివాసాలు ఏర్పర్చుకుంటాయి. అటు వైపు వెళ్లిన వారు విషసర్పాల కాటుకు గురవుతున్నారు. షాద్‌నగర్ ప్రాంతంలో చాలా మంది పాము కాటుకు గురైన బాధితులు ఉన్నారు.

విషపు రక్తాన్ని పిండేయాలి

పాము కరిచిన వెంటనే ఆ భాగంలో బ్లేడుతో గాటు పెట్టి విషపూరితమైన రక్తాన్ని పిండేయాలి. అయితే చాలా మంది నోటితో ఆ రక్తాన్ని పీల్చాలని చూస్తారు. నోటిలో ఏదైనా చిన్నపాటి గాయం ఉన్నా పీల్చిన విషపు రక్తం శరీరంలోకి ప్రవేశించే అవకాశాలు ఉంటాయి. అలా నోటి ద్వారా రక్తాన్ని పీల్చకుండా, పిండేసి గాట్లు పడిన చోటుకు కొద్ది పైభాగంలో గట్టిగా తాడుతో బిగించి రక్త ప్రసరణ జరగకుండా చేయాలి. అనంతరం సమీపంలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించి చికిత్స చేయించాలి. తద్వారా పాము కాటుకు గురైన బాధితుల ప్రాణాలు కాపాడే అవకాశాలుంటాయి.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు రాత్రివేళల్లో పొలం వద్దకు వెళ్లే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మోకాలి వరకు రక్షణ ఉంటే విధంగా బూట్లు ధరించడం ఎంతో మేలు. పొలం గట్లపై ఉండే పాములను గుర్తించడం అంత సులభం కాదు. రాత్రి వేళల్లో విధిగా టార్చిలైట్‌ను తీసుకెళ్లాలి. అదే విధంగా ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి పరిసరాల్లో పెరిగే పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాములు ఇళ్లలోకి చొరబడి కాటేస్తుంటాయి. పాము కాటేస్తే విషం రక్తంలో కలిసిపోయి గుండెకు చేరుతుంది. కేవలం 30 నిమిషాల్లో విషయం శరీరమంతా పాకి మృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఆలస్యం చేయకుండా వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పీహెచ్‌సీల్లో కూడా పాము కాటుకు సంబంధించిన యాంటీ వీనమ్ మందులు ఉన్నా, చాలా మంది పట్టణాల్లో ఉండే ఆస్పత్రులను సంప్రదిస్తున్నారు. ఫలితంగా అప్పటికే బాధితుడి పరిస్థితి విషమించే ప్రమాదం ఉంది.

నెలలో 45 మంది బాధితులు

ప్రతి ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు పాముల బెడద అధికంగా ఉంటుంది. అయితే షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, కొందుర్గు, కేశంపేట, నందిగామ, ఫరూఖ్‌నగర్, చౌదరిగూడ మండలాల్లో చాలా మంది పాము కాటుకు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాలు కురుస్తుంటంతో విపరీతంగా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములకు ఆవా సాలుమారుతున్నాయి. దీంతో వ్యవసాయ పొలాల వద్ద రైతులు పాము కాటు బారిన పడుతున్నారు. నెల రోజుల్లో షాద్‌నగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సుమారు 45 పాము కాటు కేసులు నమోదయ్యాయి.

పాముకాటుకు టీకాలు సిద్ధం



వర్షాకాలం ప్రారంభం కావడంతో పాటుకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రిలో పాము కాటుకు సంబంధించిన విరుగుడు ఇంజెక్షన్‌లు సిద్ధంగా ఉన్నాయి. బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పాటు కాటుకు గురైన వారిని ఆలస్యం చేయకుండా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

– డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటిండెంట్, సీహెచ్‌సీ, షాద్‌నగర్

ఆక్రమణలు తొలగించండి

గచ్చిబౌలి: కాలనీల్లో అంతర్గత రహదారులపై ఆక్రమణలను తొలగించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని బొటానికల్ గార్డెన్ రోడ్డు, చందానగర్ సర్కిల్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్, అపర్ణ రోడ్లను పరిశీలించారు. రహదారులను ఆక్రమించి ఫుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలన్నారు. రహదారులకు ఇరువైపుల పేరుకుపోతున్న చెత్త, గ్రీన్ వేస్టేజీను ఎప్పటికప్పుడు తరలించాలని వైద్యాధికారిని ఆదేశించారు. రహదారులపై ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలని, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన డివైడర్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. బొటానికల్ గార్డెన్ ఎదురుగా ఉన్న గుడిసెలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో డీసీ రజినీ కాంత్ రెడ్డి, ఏసీపీ మెహర, ఏఎంఓహెచ్ డాక్టర్ కార్తీక్ డీఈ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేగూరులో యువకుల వీరంగం

- మా ఊరిలోనే షాపు పెడతావా.. అని యజమానిపై దాడి
- షాపులోని ఫర్నిచర్ ధ్వంసం



ధ్వంసమైన షాపులోని సామగ్రి

నందిగామ: డ్రైక్లీనింగ్ షాపులో దూరి యువకులు వీరంగం సృష్టించారు. తమ అనుమతి లేకుండా షాపు ఎలా పెడతావని యజమానిపై దాడి చేయడంతో పాటు ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన ఘటన మండంలోని చేగూరులో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని వీర్లపల్లికి చెందిన చాకలి శ్రీకాంత్ జీవనోపాధి నిమిత్తం చేగూరులో డ్రైక్లీనింగ్ షాపును ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఉదయం యథావిధిగా షాపును తెరవగా చేగూరు గ్రామానికి చెందిన ఆవుల శివ, ఆవుల బుగ్గేష్‌లు.. మా గ్రామంలో షాపు ఎలా పెడతావంటూ బూతులు తిడుతూ వీరంగం సృష్టించారు. సుమారు రూ.2.80 లక్షల విలువైన సామగ్రి, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన తనపై దాడి చేయగా తప్పించుకొని పారిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక ఎస్సై గోపాల కృష్ణను వివరణ కోరగా.. ఫిర్యాదును రిసెప్షన్‌లో ఇచ్చి వెళ్లినట్లున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రాజెక్టులపై ప్రజాభిప్రాయం తప్పనిసరి

పర్యావరణవేత్త కవుల సరస్వతి

యాచారం: ఫార్మాసిటీని రద్దు చేస్తున్నామని ప్రకటనలే తప్పా సర్కారు నుంచి స్పష్టమైన గెజిట్ విడుదల కాలేదని పర్యావరణ వేత్త కవుల సరస్వతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఎవైనా కొత్త ప్రాజెక్టులు పెట్టాల్సి వస్తే నింబంధనల ప్రకారం సర్కారు మళ్లీ ప్రజల ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని అన్నారు. అదే విధంగా ఏర్పాటు చేసే పరిశ్రమలు, ప్రాజెక్టులపై పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ సర్కారు చేసిన తప్పులే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆమె అన్నారు.

స్నేహం ముసుగులో లైంగిక దాడి

మిత్రుడితో కలిసి యువతిపై అఘాయిత్యం

హస్తినాపురం: తనను నమ్మి వచ్చిన చిన్ననాటి స్నేహితురాలికి మద్యం తాగించి.. స్నేహితుడితో కలిసి లైంగిక దాడికి పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏసీపీ పి.కాశిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, గౌతంరెడ్డి అనే యువకుడు పాఠశాల స్నేహితులు. యువతికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో పార్టీ చేసుకునేందుకు సోమవారం రాత్రి 7.30కు వీరిద్దరూ కలిసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓంకార్ నగర్ కాలనీలోని బొమ్మరిల్లు బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ ఇద్దరూ మద్యం తాగారు. ఆ తర్వాత ఇదే రెస్టారెంట్‌లో గౌతంరెడ్డి గది అద్దెకు తీసుకుని యువతిని తీసుకెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తన స్నేహితుడిని కూడా గదికి పిలిచాడు. ఇద్దరు కలిసి యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మద్యం మత్తు నుంచి తేరుకున్న యువతి గదిలో గౌతంరెడ్డి తో పాటు మరో వ్యక్తి ఉండడంతో తనపై లైంగిక దాడి జరిగిందన్న విషయాన్ని గమనించి గట్టిగా కేకలు వేసింది. దీంతో కంగారు చెందిన ఇద్దరు యువకులు అక్కడ నుంచి పారిపోయారు. బాధితురాలు విషయాన్ని రెస్టారెంట్ సిబ్బంది దృష్టి తీసుకెళ్లగా వారు ఆమె స్నేహితులకు సమాచారం అందించారు. వెంటనే యువతి స్నేహితులు రెస్టారెంట్‌కు వచ్చి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు గౌతంరెడ్డిని అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఏసీపీ కాశిరెడ్డి వెల్లడించారు.

జావెలిన్ త్రోలో విద్యార్థి సత్తా



రాజేశ్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు యాదగిరి

అబ్దుల్లాపూర్‌మెట్: సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని బాటసింగారం జెడ్పీ పాఠశాల విద్యార్థి సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి రమావత్ రాజేశ్ జావెలిన్‌త్రో 16 సంవత్సరాల బాలుర విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు. ఆగస్టు 7న జరిగే మూడో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు మల్యాల యాదగిరి తెలిపారు. బంగారు పతకం సాధించిన రాజేశ్‌ను మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించి అభినందించారు. అంకితభావంతో కఠోర సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల క్రీడాకారులు రాణించాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు, పాఠశాల అమ్మ ఆదర్శ చైర్మన్, తల్లిదండ్రులు, గ్రామస్తులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు రాజేశ్‌ను అభినందించారు.

50 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు, పరారీలో ముగ్గురు
- జల్సాలకు అలవాటుపడి దందా సాగిస్తున్న వైనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. వారి నుంచి 50.4 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి ఆమె వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడి గ్రామానికి చెందిన చదలవాడ అనిల్, ఏపీలోని అనకాపల్లి జిల్లా కూసర్లపూడి మండలం రోలుగుంట గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి వెంకటలక్ష్మి ఇద్దరు కలిసి ఒడిశా రాష్ట్రానికి చెందిన పటాన్నయక్ వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. ఇదే క్రమంలో సోమవారం మధ్యాహ్నం శ్రీశైలం జాతీయ రహదారి సరస్వతిగూడ గేటువద్ద అనిల్, వెంకటలక్ష్మిలు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు అదుపులోని తీసుకొని వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా అందులో సుమారు రూ.13 లక్షల విలువ చేసే 50.4 కిలోల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు, జియో వైఫై డాంగిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనిల్ తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ప్యాకెట్లలో నింపి ఆంధ్ర నుంచి తెలంగాణ, మహారాష్ట్రాల్లో అధిక ధరకు విక్రయిస్తుంటారు. దీనికి కారణమైన మరో ముగ్గురు నిందితులు సిరిబాబు, నాగ్, పట్నాయక్ పరారీలో ఉన్నారు. అక్రమ సంపాదన, జల్సాలకు అలవాటు పడి గంజాయి దందా చేస్తున్నారన్నారు. పట్టుబడిన వారిలో అనిల్‌పై కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో నకిలీ కరెన్సీ, చీటింగ్ కేసులు నమోదయ్యాయి. యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి అలవాటు పడి ఆరోగ్యాలు పాడు చేసుకోవద్దని డీసీపీ సూచించారు. నిందితులను పట్టుకున్న పోలీసులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, రవీందర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కొందుర్గు: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంజాయి తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం ఉదయం కొందుర్గు శివారులోని ఇంక్రిడబుల్ ఇండియా వెంచర్‌కు వెళ్లే దారి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. షాద్‌నగర్ నుంచి కొందుర్గు వైపు వెళుతున్న స్కూటీలో ఐదు ప్యాకెట్ల గంజాయి పట్టుబడింది. దాదాపు 155.98 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న దన్వాడకు చెందిన భానుప్రకాష్, నారాయణపేటకు చెందిన సాయి ప్రకాష్‌రెడ్డిని అదుపులోని తీసుకొని స్కూటీని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

ఎయిర్‌పోర్టులో ట్యాక్సీ డ్రైవర్ల ఆందోళన

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంగళవారం సాయంత్రం నుంచి తెలంగాణ రాష్ట్ర ట్యాక్సీ డ్రైవర్ల ఆందోళన కొనసాగుతోంది. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలు ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్‌లతో ప్రతిరోజు వ్యాపారం చేస్తున్నాయని, దీంతో తమకు ఉపాధి దొరకడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలు అనధికారికంగా నడుస్తున్నా పోలీసులు, జీఎంఆర్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ప్రశ్నించారు. దీనిపై ఆర్‌జీఐఏ పోలీసులు, జీఎంఆర్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించారు. కాగా ట్యాక్సీలు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేకాట ఆడుతున్న 8 మంది అరెస్టు

శంషాబాద్ రూరల్: మండలంలోని మదన్‌పల్లిలో అరుణ్‌కుమార్‌కు చెందిన ఫాంహౌజ్‌లో సోమవారం రాత్రి కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఫాంహౌజ్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న రాంచందర్‌రాజు, స్వామి, రమేష్, దశరథ, రాజు, హన్మంతు, నందం, సత్యంను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ 8 మంది నుంచి రూ.1,20,250 నగదును స్వాధీనం చేసుకున్నారు.